



# మదుపుతోనే గెలుపు





## ద్రవ్యసమీక్షపైనే..

**మార్కెట్ పల్స్**

**దేశీయ** స్టాక్ మార్కెట్లు లాభాలకు దూరంగా ట్రేడ్ అవుతున్నాయి. గతకొద్ది రోజులుగా మదుపరులు పెట్టుబడులకు సంశయిస్తున్నారు. ఫలితంగా సూచీలు నష్టాలకే పరిమితం కావాల్సి వస్తున్నది. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 270.07 పాయింట్లు లేదా 0.33 శాతం పడిపోయి 81,451.01 దగ్గర నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 102.45 పాయింట్లు లేదా 0.41 శాతం కోల్పోయి 24,750.70 వద్ద స్థిరపడింది. ఈ వారం కూడా సూచీలు పడుతూలేస్తూ పయనించే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను రెండో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను ఈ నెల 4-6 తేదీల్లో నిర్వహించనున్నది. దీంతో వడ్డీరేట్లపై ఆర్బీఐ నిర్ణయాల ఆధారంగా మార్కెట్లు ట్రేడ్ అయ్యే వీలున్నదని చెప్పవచ్చు. ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా జరిగిన రెండు ద్రవ్యసమీక్షల్లో రెపోరేటును ఆర్బీఐ అర శాతం తగ్గించిన విషయం తెలిసిందే. రాబోయే ద్రవ్యసమీక్షలోనూ మరో పావు శాతం తగ్గవచ్చన్న అంచనాలున్నాయి. ఇదే జరిగితే బ్యాంకింగ్, ఆటో, రియల్టీ, ఇతరత్రా కన్జ్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు ఆకర్షణీయం కానున్నాయి. సూచీలు తిరిగి లాభాలను సంతరించుకోవచ్చు. ఇక ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు, ముడి చమురు ధరలు దేశీయ మార్కెట్లను నిర్దేశించనున్నాయి. అయితే అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 24,300 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,000 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. కానీ సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,300-25,500 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

*గమనిక..*

*స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.*




**నేడు** మనం చేసే పొదుపు, పెట్టుబడులే రేపు మన భవిష్యత్తుకు రక్షణనిస్తాయి. దీర్ఘకాలంలో ఆర్థిక క్రమశిక్షణకు ఇవే సోపానాలు. ముఖ్యంగా మన ఆర్థిక లక్ష్యాల సాధనకు పెట్టుబడులే కీలకం. తెలివైన నిర్ణయాలతో చక్కని రాబడులను అందుకోవచ్చు. మరి ఇందుకున్న అవకాశాలు ఏమిటి? ఎలా ముందుకెళ్తే వాటిని సద్వినియోగం చేసుకోవచ్చు?

### డైరెక్ట్ ఈక్విటీ

స్టాక్స్‌లో పెట్టే పెట్టుబడులనే డైరెక్ట్ ఈక్విటీ అంటారు. ఏదైనా కంపెనీ షేర్లను మీరు కొన్నట్టైతే.. అందులో మీకు పాక్షికంగా యాజమాన్య హక్కులు వచ్చినట్టే. ఇక ఈ పెట్టుబడులకు స్టాక్ ఎక్స్ఛేంజీలు వేదికలవుతాయి. డీమ్యాట్ ఖాతాల ద్వారా షేర్ల క్రయవిక్రయాలను చేయవచ్చు. అయితే స్టాక్ మార్కెట్ పెట్టుబడులు అనేక అంశాలకు ప్రభావితమై ఉంటాయి. కాబట్టి ఈ ఇన్వెస్ట్‌మెంట్స్ రిస్కులతో ముడిపడి ఉంటాయి. అందుకే మార్కెట్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలి.

### మ్యూచువల్ ఫండ్స్

మ్యూచువల్ ఫండ్స్ సంస్థల గురించి నేటి తరం ఇన్వెస్టర్లకు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మన పెట్టుబడులను స్టాక్ మార్కెట్లతోపాటు డెట్, హైబ్రిడ్ ఫండ్స్ తదితర రకరకాల సాధనాల్లో మదుపు చేస్తాయి. దీర్ఘకాలిక మదుపునకు మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు లాభదాయకం. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్)తో ప్రారంభం బాగుంటుంది. అయితే ఇవి కూడా రిస్క్‌తో కూడుకున్నవే. సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదివి ముందుకెళ్లాలి.

### ఫిక్స్‌డ్ డిపాజిట్లు

బ్యాంకులు, ఇతర ఫైనాన్షియల్ సంస్థలు ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)ను ఆఫర్ చేస్తాయి. ఇవి సురక్షిత పెట్టుబడులు అని చెప్పవచ్చు. రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల ఆధారంగా డిపాజిటర్లకు వడ్డీ అదాయం ఉంటుంది. పన్ను మినహాయింపులు లభిస్తాయి. ప్రధానంగా సీనియర్ సిటిజన్లకు అనువైనవి. వీటికి లాకిన్ పీరియడ్ ఉంటుంది.

### రికరింగ్ డిపాజిట్లు

రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ) కూడా మరో ఫిక్స్‌డ్ టెన్యూర్ ఇన్వెస్ట్‌మెంట్. బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఈ పెట్టుబడులకు అవకాశం ఉంటుంది. నెలనెలా చిన్నచిన్న మొత్తాలతో మదుపునకు వీలుంటుంది. పెట్టుబడికి రక్షణ, గ్యారంటీడ్ ఇన్‌కమ్ వీటి సొంతం.

### పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్

ఇదో దీర్ఘకాలిక పన్ను ఆదా పెట్టుబడి. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)కు లాకిన్ పీరియడ్ 15 ఏండ్లు. కేంద్ర ప్రభుత్వం హామీ ఉంటుంది. ప్రతీ మూడు నెలలకోసారి వడ్డీరేట్లను కేంద్రం నిర్ణయించి ప్రకటిస్తుంది.

### ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్

ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్).. వేతన జీవులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులు లభిస్తాయి. ఇందులో జమయ్యే నిధులకు అధిక వడ్డీరేటు లభిస్తుంది. కాబట్టి వీటిని ఉపసంహరించుకోకుండా కాపాడుకోవడం కూడా మంచి పెట్టుబడి కిందకే వస్తుంది.

### నేషనల్ పెన్షన్ సిస్టమ్

పీపీఎఫ్, ఈపీఎఫ్‌లతో పోల్చితే నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో పెట్టుబడిదారులు అధిక రాబడులను పొందవచ్చు. పన్ను ప్రోత్సాహకాలుంటాయి. అయితే ఈ పథకాన్ని ఎంచుకొంటే రిటైర్మెంట్‌దాకా లాకిన్ పీరియడ్ ఉంటుంది. అయినప్పటికీ నిబంధనలకు లోబడి 40 శాతం వరకు నిధులను వెనక్కి తీసుకోవచ్చు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్‌పీఎస్ సబ్‌స్క్రిప్షన్ తప్పనిసరిగా ఉన్నది.

## కొంచెం కొత్తగా ఆలోచిద్దాం..

**రోజులు** మారిపోయాయి. ఒకప్పటితో పోల్చితే మదుపరులకు పెట్టుబడికున్న అవకాశాలూ పెరిగిపోయాయి. సంప్రదాయ పెట్టుబడుల స్థానంలో ఇప్పుడు హైటెక్ పెట్టుబడులు వస్తున్నాయి. నేటి తరం వీటిపై మరింతగా దృష్టి సారిస్తే గొప్ప ప్రయోజనాలనే అందుకోవచ్చు. మరి వాటిలో..

**ఏఐ ఆధారిత ఈటీఎఫ్‌లు**

ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)ల్లో పెట్టుబడుల ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్, ఆటోమేషన్ తదితర నయా టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్స్ వైపునకు అడుగులు వేయవచ్చు. ఇప్పుడున్న పరిస్థితుల్లో భవిష్యత్తు అంతా వీటిదేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కాబట్టి ఏఐ ఫోకస్డ్ ఈటీఎఫ్‌లను ఎంచుకోవడం ఉత్తమమే.

**క్రిప్టో సిప్స్**

బిట్‌కాయిన్ వంటి ప్రధాన క్రిప్టోకరెన్సీల్లో సిస్టమ్యాటిక్ మంత్లీ ఇన్వెస్ట్‌మెంట్స్ (సిప్).. యువతరానికి బాగా కలిసిరాగలవని మెజారిటీ నిపుణుల అంచనా. దీర్ఘకాలంలో సంపద సృష్టికి ఇవి దోహదం చేయగలవు.

**గ్రీన్ బాండ్లు, డిజిటల్ గోల్డ్**

రెన్యువబుల్ ఎనర్జీ, సస్టెయినబుల్ ప్రాజెక్టుల్లో ఫండింగ్ చేసే గ్రీన్ బాండ్లనూ మదుపరులు తమ పెట్టుబడులకు ఎంచుకోవచ్చు. అలాగే యూపీఐ యాప్స్ ద్వారా సూక్ష్మ పెట్టుబడులనూ అనుసరించవచ్చు. పీర్-టు-పీర్ లెండింగ్ సాధనాలనూ పరిశీలించవచ్చు.






జూలపల్లి : పూర్వ ఉపాధ్యాయులతో విద్యార్థులు



కాల్వశ్రీరాంపూర్: పూర్వ ఉపాధ్యాయులతో విద్యార్థులు..



యైటింక్లయిన్ కాలనీ : పూర్వ ఉపాధ్యాయులతో స్పందన పాఠశాలవిద్యార్థులు..

## సందడిగా ఆత్మీయ సమ్మేళనాలు

జిల్లాలోని పలు విద్యాసంస్థల్లో పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనాలు ఏర్పాటు చేసుకున్నారు. ఎస్సెస్సీ పూర్తయిన అనంతరం వివిధ వృత్తులు, ఉద్యోగాలు, వ్యాపారాలతో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా తాము చదువుకున్న పాఠశాలల్లో మళ్లీ కలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపారు. తమకు చదువు నేర్పిన గురువులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. జూలపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 2004-05 బ్యాచ్(పదో తరగతి), కాల్వశ్రీరాంపూర్ హైస్కూల్ 1996-97 బ్యాచ్, గోదావరిఖని గాంధీనగర్‌లోని గీతాంజలి హైస్కూల్‌కు చెందిన 2003-04, మార్కండయకాలనీకి చెందిన వాణి విద్యావిహార్ పాఠశాలకు చెందిన 1999-2000, స్పందన పాఠశాల 2007-08, మానీపూర్ మూర్తి విద్యాలయంలో 2001-02 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు.

జూలపల్లి/కాల్వశ్రీరాంపూర్/ఫర్టిలైజర్‌సిటీ/యైటింక్లయిన్ కాలనీ/కమాన్‌పూర్



ఫర్టిలైజర్‌సిటీ : వాణివిద్యా విహార్ పూర్వ విద్యార్థులు



ఫర్టిలైజర్‌సిటీ : గీతాంజలీ పూర్వ విద్యార్థులు




కమాన్‌పూర్: మూర్తి విద్యాలయం 2001-02 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

### విద్యార్థుల సంఖ్య పెంచేందుకు

## వినూత్న ప్రయోగాలు



విద్యార్థులతో హెచ్ఎం సుధాకర్ రావు


సుల్తానాబాద్‌రూరల్, జూన్ 1: పోటీ తత్వం పెరుగుతున్న తరుణంలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సుల్తానాబాద్ మండలంలోని బొంతకుంటపల్లి మండల ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు టీ సుధాకర్ రావు ఐతరాజ్‌పల్లి నుంచి డిప్యూటేషన్‌పై బొంతకుంటపల్లికి 2024 జూలై 15న వచ్చారు. అప్పటి నుంచి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు వివిధ రకాల కార్యక్రమాలు చేపడుతున్నారు. పాఠశాల ప్రత్యేకతపై ముద్రించిన కర పత్రాలను ఇంటింటా తిరుగుతూ బోధనా పద్ధతులు వివరిస్తు విద్యార్థులను పంపించాలని పిల్లల తల్లిదండ్రులన కోరుతున్నారు. 8 మంది ఉన్న విద్యార్థులు 16 మంది వరకు అయ్యారు. విద్యార్థుల సంఖ్య పెరుగుతుండడంతో పాఠశాల మర్మతు కోసం కలెక్టర్ కోయ శ్రీ హర్షను కలిశారు. రెండు విడుతల్లో రూ. 3. 50 లక్షలు ఇచ్చారు. దీంతో పాఠశాలకు కిటికీ , దర్వాజా, మరుగుదొడ్ల నిర్మాణం, నీటి సరఫరా, సంపు, అదనంగా రెండు తరగతి గదులు ఏర్పాటు చేశారు. గ్రామానికి నాలుగు దిక్కుల్లో ఉన్న విద్యార్థులను పాఠశాలకు తీసుకువచ్చేందుకు గ్రామస్తులతో మాట్లాడి వారి సహకారంతో ఆటోను ఏర్పాటు చేయించారు. ఆటోలో విద్యార్థులను పాఠశాలకు తీసుకువస్తున్నారు. పాఠశాల రోడ్డుకు దగ్గరలో ఉండడంతో ప్రస్తుతానికి పిల్లలకు రక్షణ కోసం ట్రీ గార్డులతో గేటు ఏర్పాటు చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పుస్తకాలు, దుస్తులు, అందిస్తున్నట్లు వివరిస్తున్నారు. మరిన్ని రకాల కార్యక్రమాలతో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే దిశగా చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతానికి సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నారు.

**నాణ్యమైన విద్యా బోధన**



ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాభోదన అందిస్తున్నాం. విద్యార్థుల సంఖ్యను పెంచే దిశగా ముందుకు సాగుతున్నాం. 8 మంది నుంచి 16 మందికి విద్యార్థుల సంఖ్య పెంచాం. ఆటో ద్వారా మరి కొంతమంది విద్యార్థులు వస్తున్నారు. పాఠశాలకు గేటు లేదనే కారణంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పంపించడం లేదు. అందుకే ఇనుప గేటును ఏర్పాటు చేయిస్తున్నాం. గ్రామానికి చెందిన పొలాడి వెంకట్‌రావు పాఠశాలకు మూడు సీలింగ్ ఫ్యాను, విద్యార్థులకు సరిపడా నోట్ బుక్స్, క్రీడా సామగ్రి అందజేశారు.

**టీ సుధాకర్ రావు, ప్రధానోపాధ్యాయుడు**



సుల్తానాబాద్ రూరల్ : బొంతకుంటపల్లి ప్రభుత్వ పాఠశాల

### ప్రజా సేవలో నా నేస్తం ట్రస్టు

ఎలిగేడు, జూన్ 01 : ఎ మండలంలో నా నేస్తం చారిటబుల్ ట్రస్టు ప్రజా సేవలో ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటుందని అధ్యక్షుడు కట్ల సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం నాడు సభ్యుల సమక్షంలో ట్రస్టు సేవా భవనంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు ఆధ్వర్యంలో చేసే ప్రజాసంక్షేమ కార్యక్రమాల పై పలు నిర్ణయాలు తీసుకున్నారు. ప్రతీ గ్రామం నుండి నా నేస్తం చారిటబుల్ సభ్యులను ఏర్పాటు చేశామన్నారు. ఎలిగేడు బూర్ల రాజేశం, కట్ల సత్యం(టైలర్), ధూళికట్ట లక్ష్మీనారాయణ, లాలపల్లి డిల్లీశ్వర్‌రెడ్డి, నర్సాపూర్ అశోక్, సుల్తాన్‌పూర్ వీరయ్యగౌడ్, సుధాకర్‌రావు, బుర్హాన్‌మియ్యాపేట్ కనుకయ్య గౌడ్ ఆకుల, ముప్పి రితోట-లోకపేట రంగు రాములగౌడ్, ర్యాకల్‌దేవ్‌పల్లి గంప రాజు, రాములపల్లి టీ రమేశ్‌ను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ కట్ల సత్యనారాయణ, మేనేజింగ్ ట్రస్టీ వీరగోని లక్ష్మీనారాయణ, పెంట శ్రీనివాస్, డిల్లేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్, రంగు రాములు, అశోక్, రమేష్, కట్ల సత్యనారాయణ (టైలర్), వంగ శ్రీశైలం, బూర్ల రాజేశం, వంగ సత్య నారాయణ, మల్లారెడ్డి పాల్గొన్నారు.

### బడిబాట అనంతరమే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలి

ధర్మారం, జూన్1: బడిబాట అనంతరం ఉపాధ్యాయుల సర్దు బాటు ప్రక్రియను చేపట్టాలని ప్రాథమిక పాఠశాలల ప్రధానో పాధ్యాయుల సంఘం రాష్ట్ర నాయకుడు నూతి మల్లయ్య కోరా రు. ఈ మేరకు ఆయన ధర్మారం మండల కేంద్రంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆశాస్త్రీయంగా ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను వెంటనే నిలిపి వేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం సహకరించాలని కోరారు. రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన సర్దుబాటు ఉత్తర్వులను సమీక్ష చేసి ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను పరిగణన లోకి తీసుకొని క్షేత్రస్థాయిలో పాఠశాలల పరిస్థితులను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని విన్నవించారు.



కీచులాటపల్లిలో రోడ్డు పక్కనున్న పాత బావి

### పట్టించుకోకపోతే ప్రమాదమే..

జూలపల్లి, జూన్ 1: కీచులాటపల్లిలో పాత కాలం నాటి చేదబావి ప్రమాదాలకు నిలయంగా మారింది. కాలక్రమేణా అంతర్గత రహదారి ఎత్తుకాగా, పాత బావి కిందికైంది. రోడ్డుకు సమాంతరంగా మారిన బావికి ఎలాంటి రక్షణ ఏర్పాట్లు కరువయ్యాయి. పశువులు, చిన్నారులు, వాహనదారులు గమనించకపోతే బావిలో పడిపోయే ప్రమాదం పొంచి ఉన్నది. దాదాపు 70 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం గ్రామస్తులకు తాగునీటి వసతి కల్పించడానికి సామాజిక బావి తవ్వించింది. ఏండ్ల తర బడి ఇదే బావిపై గ్రామస్తులు ఆధారపడి మంచినీటిని విని యోగించుకున్నారు. కరువు కాటకాలు వచ్చినా, ఎండలు దంచికొట్టినా బావిలో తాగునీటికి కొదువ ఉండదు. ప్రస్తు తం ఇంటింటా మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు అందించడంతో ఆ పాతకాలం నాటి బావి నిరుపయో గంగా మారింది. గ్రామస్తులంతా ముద్దుగా పిలుచుకునే 'చెల్మ బాయి'కి రక్షణ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## జగిత్యాల పోలీసులకు సేవా పతకాలు

జగిత్యాల కలెక్టరేట్/కోరుట్ల, జూన్ 1: రాష్ట ప్రభుత్వం అందించే పోలీస్ సేవా పతకాలకు జిల్లాకు చెందిన పలువురు పోలీసు అధికారులు ఎంపికయ్యారు. పతకాలు అందుకోనున్న పోలీసు అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు. విధి నిర్వహణలో కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు వస్తుందన్నారు. రానున్న రోజుల్లో సైతం మరింత ఉత్తమ సేవలందించాలని ఈ సందర్భంగా ఎస్పీ ఆకాంక్షించారు. ఏఆర్ ఎస్ఐ రామస్వామి, స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ శ్రీనివాస్ ఉత్తమ సేవా పతకం, ఎండీ జమీల్, నరసింహారెడ్డి (ఏఎస్ మెట్‌పల్లి పీఎస్), భిక్షపతి (స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ), ఎస్ శ్రీనివాస్ (ఆర్ఎస్ఐ, జగిత్యాల), ఎం మల్లారెడ్డి, రవి (హెడ్ కానిస్టేబుల్, మల్యాల), నీల్యా నాయక్, శ్రీనివాస్ (హెడ్‌కానిస్టేబుల్, కథలాపూర్), మహ్మద్ ఇలియాస్ అహ్మద్ (హెడ్‌కానిస్టేబుల్, మేడిపల్లి), ఎస్ నాగన్న, మల్లారెడ్డి (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, జగిత్యాల), రాజమౌళి (హెడ్ కానిస్టేబుల్, గొల్లపెల్లి), ఎస్ తనోబా (హెడ్‌కానిస్టేబుల్, ఇబ్రహీంపట్నం), ప్రకాశ్ (హెడ్ కానిస్టేబుల్, మెట్‌పల్లి) సేవా పతకానికి ఎంపికయ్యారు.